సాక్షి విశాఖపట్నం

గురువారం : 14 : నవంబర్ : 2024

ఐవోసీఎల్ చైర్మన్‌గా అర్విందర్



బీచ్‌రోడ్డు: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా అర్విందర్ సింగ్ సాహ్ని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1993లో ఇండియన్ ఆయిల్ కంపెనీలో చేరిన ఆయన.. పలు కీలకమైన పదవులు చేపట్టారు. పారాదీప్ రిఫైనరీని ప్రారంభించడంలో కీలక పాత్ర పోషించారు.

బాగ్చీకి అదనపు బాధ్యతలు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చీకి డైరెక్టర్ (ఆపరేషన్స్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన డైరెక్టర్ (ఆపరేషన్స్)గా, ఇన్‌చార్జి సీఎండీగా కొంత కాలం బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే..

కేజీహెచ్ ఏడీగా అప్పారావు



మహారాణిపేట: కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్(పరిపాలన)గా పి.ఎస్.అప్పారావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన గతంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌లో పనిచేశారు.

న్యూస్‌రీల్

నేడు బాలబాలికలకు ఉచిత ప్రవేశం

విశాఖ సిటీ: బాలల దినోత్సవం సందర్భంగా గురువారం వీఎంఆర్‌డీఏ ఆధీనంలో ఉన్న పర్యాటక కేంద్రాలు, పార్కుల్లో బాల బాలికలకు ఉచిత ప్రవేశం ఉంటుందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సెంట్రల్ పార్కు, కైలాసగిరి, తెలుగు మ్యూజియం, సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ–142, తొట్లకొండ, వీఎంఆర్‌డీఏ పార్కుల్లో ప్రవేశాలకు బాలిబాలికలు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించారు.

ఆక్సిజన్ టవర్స్‌లో అగ్ని ప్రమాదం



3003 ఫ్లాట్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

సీతమ్మధార: సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో బుధవారం రాత్రి 11.40 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. 30వ అంతస్తులోని 3003వ ఫ్లాట్‌లో బాలుడు బాణసంచా కాల్చడంతో మంటలు చెలరేగినట్లు స్థానికులు చెబుతున్నారు.. అవి విద్యుత్ తీగలను తాకి, బెడ్ రూమ్‌లోని ఏసీ వద్ద షార్ట్ సర్క్యూట్‌కు కారణమయ్యాయి. దీంతో మంటలు బెడ్‌రూమ్ నుంచి వేగంగా వ్యాపించాయి. ఈ ఘటనతో టవర్స్‌లో నివసిస్తున్న వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమీపంలోని తోపుడుబండి వ్యాపారులు, స్థానికులు ఈ విషయాన్ని గమనించి వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. రీజినల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్ రెడ్డి తన సిబ్బందితో టవర్స్‌కు చేరుకుని.. చాకచక్యంగా మంటలను అదుపుచేశారు. ఎంవీపీ సీఐ జె.మురళీ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంలో సోఫా, టీవీ, దుస్తులు దగ్ధమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. అయితే ఇంట్లో బాలుడు ఒక్కటే ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా శ్రీనివాసరావు

విశాఖ సిటీ: విశాఖ స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీగా బి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమల బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్బీ ఏడీసీపీగా విధులు నిర్వర్తించిన వెంకట్రావు ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఆ స్థానంలో ఎవరినీ భర్తీ చేయలేదు. తాజాగా జరిగిన బదిలీల్లో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న శ్రీనివాసరావును ఎస్బీ ఏడీసీగా నియమించారు.

నిందితులకు జైల్లో ఎమ్మెల్యే గంటా పరామర్శ

ఆరిలోవ: గృహిణి అనుమానాస్పద మృతి కేసులో రిమాండ్‌లో ఉన్న వారిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ములాఖత్‌లో కలిశారు. ప్రజాప్రతినిధిగా ఉన్న ఆయన వీరిని పరామర్శించేందుకు కారాగారానికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 8న బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఉంటున్న సత్యప్రియను అత్తింటివారే హత్య చేశారని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సత్యప్రియ భర్త కార్తికేయ, మామను పోలీసులు అరెస్టు చేసి ఈ నెల 9న రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం వారిద్దరూ విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వద్ద సత్యప్రియ మామ ఆడిటర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం గంటా శ్రీనివాసరావు జైలుకు వెళ్లి వారిని పరామర్శించారు. కొద్దిసేపు వారితో మాట్లాడారు. అనంతరం రిమాండ్‌లో ఉన్న వారిద్దరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా చూసుకోవాలని జైలు అధికారులకు గంటా చెప్పినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా మహిళ అనుమానాస్పద మృతి కేసులో నిందితులుగా ఉన్న వారిని ప్రజాప్రతినిధిగా ఉన్న గంటా కలవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నిందితులకు అండగా గంటా నిలబడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్‌ను వివరణ కోరగా ఎమ్మెల్యే వద్ద ఆడిటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి, అతని కుమారుడిని కలిసేందుకు రెండు ములాఖత్‌ల ద్వారా ఐదుగురు వచ్చినట్లు తెలిపారు.

సోషల్ మీడియా కార్యకర్తలపై కేసుల నమోదు

పెందుర్తి: టీడీపీ నేతల ఫిర్యాదుల మేరకు పలువురు సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. రాయవరానికి చెందిన ఖండవిల్లి సునీల్‌కుమార్, కోరుకొండకు చెందిన లగవత్తుల శివసత్యకుమార్, కనిగిరికి చెందిన హరీశ్వర్‌రెడ్డి రాష్ట్ర మంత్రి గుమ్మల సంధ్యారాణి, ఆమె కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు పెట్టారని పెందుర్తి మండల టీడీపీ అధ్యక్షుడు కరక దేముడు ఫిర్యాదు చేశారు. జగ్గంపేటకు చెందిన కాకరపర్తి శ్రీనివాస్ అనే వ్యక్తి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూను అసభ్య పదజాలంతో దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారని అనకాపల్లి జిల్లా తెలుగు యువత కార్యదర్శి బొడ్డు అప్పలరాజు ఫిర్యాదు చేశారు. సునీల్ కుమార్, శివసత్యకుమార్, హరీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌పై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హోరి! పిడుగా..





విశాఖ నగరం ప్రకృతి అందాలతో పాటు ప్రతిభావంతమైన పిల్లల నిలయం. ఇక్కడి పిల్లలు స్కేటింగ్, క్రికెట్, బాక్సింగ్, చదరంగం, స్విమ్మింగ్ వంటి వివిధ రంగాల్లో రాణిస్తూ పతకాలు కొల్లగొడుతున్నారు. స్కేటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు గెలుచుకున్న క్షేత్ర, క్రికెట్‌లో రాణిస్తున్న వినోద్, స్విమ్మింగ్‌లో సత్తా చాటుతున్న గణేష్ వంటి చిన్నారులను చూసి విశాఖ గర్విస్తోంది. క్యాన్సర్ వంటి కష్టమైన పరిస్థితులను ఎదుర్కొని, పారా క్రీడల్లో తనను తాను నిరూపించుకుంటున్న నిధి అనే బాలిక ఎందరికో ఆదర్శం. ఈ చిన్నారుల పట్టుదల, కష్టపడేతత్వం ఇతర పిల్లలకు స్ఫూర్తిదాయకం. వీరి ఎదుగుదలలో వారి తల్లిదండ్రుల పాత్ర కీలకం. ఈ చిన్నారులు భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షిద్దాం. అందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు.

ఆల్‌రౌండర్ వినోద్

విశాఖ స్పోర్ట్స్: ఆరేళ్ల చిరుప్రాయంలో క్రికెట్ బ్యాట్ పట్టిన పంతుల వినోద్.. 14 ఏళ్లకే గోవాపై 150+ పరుగులు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అండర్–10లో జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన బాలుడు.. అనతికాలంలోనే అండర్–14 జిల్లా జట్టుకు నాయకత్వం వహించే స్థాయికి ఎదిగాడు. ఎటువంటి క్రీడా నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చిన గాజువాకకు చెందిన వినోద్.. క్రికెట్‌పై ఉన్న మక్కువతో అంచెలంచెలుగా ఎదిగాడు. తండ్రి విశ్వనాథ్ ప్రోత్సాహంతో అండర్–14లో గుర్తింపును తెచ్చుకున్నాడు. ప్రెసిడెంట్స్ కప్ టోర్నీలో మెట్రో క్లబ్ తరఫున ఆడిన వినోద్ జట్టును విజేతగా నిలిపాడు. నార్త్‌జోన్ అంతర్ జిల్లాల టోర్నీలో తూర్పు గోదావరిపై 177 పరుగులతో అజేయంగా నిలిచి.. కెరీర్‌లో బెస్ట్ స్కోర్‌ను నమోదు చేశాడు.

ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో క్షేత్ర మెరుపులు



విశాఖ స్పోర్ట్స్: కాళ్లకు స్కేట్స్ కడితే పతకం ఖాయం చేసుకుంటోంది క్షేత్ర శివకోటి. ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో సత్తా చాటుతున్న విశాఖ స్కేటర్ క్షేత్ర ఇటీవల ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ నాలుగు పతకాలను సాధించింది. ఇన్‌లైన్, పెయిర్ అంశాల్లో స్వర్ణాలు అందుకున్న క్షేత్ర, ప్రెసిషన్, క్వార్టెట్ అంశాల్లో కాంస్య పతకాలు సాధించింది. 2016 నుంచి కోచ్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో సత్తా చాటుతున్న క్షేత్ర ఇప్పటికే 15 స్వర్ణాలతో పాటు 20 రజతాలు, మరో 9 కాంస్యాలను అందుకుంది. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్న క్షేత్ర.. చైనాలో జరిగిన 19వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో రజతంతో మెరిసింది. తల్లిదండ్రులు మురళీకృష్ణ, భవానీ చిన్న వయసు నుంచే ఆమెకు శివాజీ పార్క్ రింక్‌లో శిక్షణ ఇప్పించారు.

సరదాగా మొదలై... ఖేలో ఇండియాకి..



గణేష్ చక్రధర్

విశాఖ స్పోర్ట్స్: ఆ చిన్నారికి ఏడేళ్ల వయసు. అతని తండ్రి లక్ష్మణ్‌కుమార్ లైఫ్ సెక్యూరిటీగా చిన్నారికి ఈత నేర్పించాలని భావించాడు. ఇంట్లో ఎవరికి క్రీడల పట్ల పెద్దగా అవగాహన లేదు. అయినప్పటికీ వేసవి సెలవుల్లో సాగరతీరంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు తీసుకెళ్లాడు. శిబిరం ముగిసేప్పటికి శ్రద్ధగా నేర్చుకోవడంతో.. రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయిస్తే బాగుంటుందని కోచ్ శ్రీధర్ సూచించారు. అలా జక్క గణేష్ చక్రధర్ ప్రస్థానం మొదలైంది. అనంతరం జిల్లా జట్టుకు ఎంపికై పతకాన్ని సాధించిన గణేష్.. నేడు జాతీయ క్రీడలతో పాటు ఖేలో ఇండియాకి ఆడే స్థాయికి ఎదిగాడు. స్టేట్ మీట్, సౌత్‌జోన్ అంతర్ స్టేట్స్ స్విమ్మింగ్ పోటీల్లో స్వర్ణాలతో సత్తా చాటుతున్న గణేష్.. విశాఖకు జాతీయ మెడల్ సాధించేందుకు శ్రమిస్తున్నాడు. బెస్ట్ ఫెర్ఫార్మర్‌గా నిలుస్తూ గత నేషనల్స్‌లో కేవలం 30 నానో సెకన్ల వ్యవధిలో పతకాన్ని కోల్పోయి నాలుగో స్థానంలో నిలిచాడు.

ప్రవల్లిక 'పంచ్'కు పవరెక్కువ!



మల్కాపురం: గొల్లవీధి ప్రాంతానికి చెందిన వాకాడ ప్రవల్లిక యాదవ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ప్రవల్లికకు బాక్సింగ్ అంటే మక్కువ. దీంతో కోచ్ నూకరాజు వద్ద బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటోంది. జిల్లా, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటుతోంది. జిల్లా స్థాయిలో 5, రాష్ట్ర స్థాయిలో 4, జాతీయ స్థాయిలో 4 బంగారు పతకాలు సాధించింది. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నది ఆమె కల.

సోలో డ్యాన్స్‌లో సత్తా



విశాఖ స్పోర్ట్స్: ఆరేళ్ల చిరుప్రాయం. అయితేనేం నేనూ **స్కేటింగ్ చేస్తా**నంటూ టి.శ్రీ రిషిత రింక్‌లోకి అడుగుపెట్టింది. ప్రారంభంలో పడిలేస్తూనే ప్రాక్టీస్ మొదలుపెట్టిన రిషితకు తల్లి చందన, తండ్రి కృష్ణప్రసాద్‌ల ప్రోత్సాహం, **కోచ్ సత్యం మార్గదర్శ**నం మేలును చేకూర్చాయి. మూడేళ్ల కిందట అంటే **2021లో శివాజీ** పార్కులో తొలిసారిగా రింక్‌లో పోటీకి దిగి **ప్రతిభ చూపింది. ఆ** ఏడాదే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై.. చండీగఢ్‌లో **జరిగిన పోటీల్లో** ఫ్రీస్టైల్, సోలో డ్యాన్స్ రెండింటా రజత పతకాలను **సొంతం చేసుకుం**ది. అప్పటి నుంచి వరసగా జాతీయ స్థాయి **పోటీల్లో పాల్గొంటూ వ**స్తోంది. 2022లో బెంగళూరు, 2023లో **చెన్నైలో జరిగిన పోటీల్లో ఫ్రీస్టైల్**, సోలోతో పాటు మరో మూడు అంశాల్లో **పోటీ పడింది. చెన్నై జరిగిన** పోటీల్లో ఫ్రీస్టైల్, సోలోలో కాంస్య **పతకాలు గెలుచుకుంది. కపుల్** డ్యాన్స్‌లోనూ తన ప్రతిభను చాటింది. **ప్రస్తుతం సత్యసాయి పాఠశాల**లో నాలుగో తరగతి చదువుతున్న **రిషిత చదువులో**నూ రాణిస్తోంది.

వండర్ కిడ్ షబీనా



తల్లిదండ్రులతో షబీనా

బీచ్‌రోడ్డు: పిల్లల్లో ఒక్కొక్క**రికి ఒక్కో రంగంపై అభిరుచి** ఉంటుంది. కానీ షబీనా అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపుతూ వివిధ విభాగాల్లో 450 పోటీల్లో పాల్గొంది. అందులో 400కుపైగా అవార్డులు సాధించింది. పలు రికార్డులు సృష్టించింది. నగరానికి చెందిన అతహర్, అయేషాల కుమార్తె షబీనా రికార్డుల పంట పండిస్తోంది. వండర్ కిడ్స్ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న ఈ బాలిక ఇప్పటి వరకు అన్ని రంగాల్లోనూ 400కు పైగా అవార్డులు గెలుచుకుంది. వాటిలో 300లకు పైగా మొదటి బహుమతులే కావడం విశేషం. పాటలు, నృత్యం, భగవద్గీత, ఖురాన్, శ్లోకాలు చెప్పడం, పద్యాలు, కథలు వినిపించడం, చిత్రలేఖనం, క్విజ్, ఈజీ రైటింగ్, స్పీచ్, మోనో యాక్షన్, ఫైర్ కుకింగ్, క్రాఫ్ట్, చేతి రాత, జీకే, ఫ్యాన్సీ డ్రెస్సింగ్, ఫ్యాషన్ షో, ఫొటోగ్రఫీ ఇలా అన్ని రంగాల్లోనూ బహుమతులు సాధించింది. 2020లో ఐదేళ్ల వయసున్న షబీనా 52 సెకన్లలో జాతీయ గీతాన్ని ఆలపించి మొదటిసారి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. 2021లో 175 దేశాల రాజధానుల పేర్లను అనర్గళంగా చెప్పినందుకు, కోవిడ్‌పై ఇచ్చిన స్పీచ్‌కు గానూ, 2023లో ట్రెడిషనల్ డ్రెస్ డ్రైవ్ విభాగంలో ఇలా మొత్తం నాలుగు సార్లు షబీనా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.

కృత్రిమ కాలుతో కదన రంగంలోకి..



పారా అథ్లెట్ నిధి

విశాఖ స్పోర్ట్స్: మధురవాడకు చెందిన నిధి ఏడేళ్ల వయసులోనే క్యాన్సర్ బారిన పడింది. చికిత్సలో భాగంగా ఆమె ఎడమ కాలును కోల్పోయింది. ఈ క్రమంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని.. క్యాన్సర్‌ను జయించి మామూలు స్థితికి చేరుకుంది. అంగవైకల్యాన్ని మరిచిపోయేందుకు ఆటలను ఎంపిక చేసుకుంది. కృత్రిమ కాలుతో కదన రంగంలోకి దిగింది. పారా క్రీడల్లో తాను తలపడుతున్న అన్ని అంశాల్లోనూ నేడు పతకాలు సాధించే స్థాయికి చేరుకుంది. అప్పట్లో ముంబయిలో క్యాన్సర్ చికిత్స తీసుకున్న ఆమె.. క్యాన్సర్ సర్వైవర్స్‌లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు నిర్వహించిన పోటీల్లో పాల్గొంది. రాంచీలో జరిగిన జాతీయస్థాయి చదరంగం అండర్–19 పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. కరోనా కారణంగా ముంబయి నుంచి విశాఖకు తల్లిదండ్రులతో వచ్చేసిన నిధి తిరిగి తర్వాత గ్వాలియర్‌లో జరిగిన పారా స్విమ్మింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. రష్యాలో జరిగిన రైఫిల్ షూటింగ్‌లో కాంస్య పతకం, చెస్, స్విమ్మింగ్‌లతో పాటు రన్నింగ్‌లో స్వర్ణ పతకాలను అందుకుంది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించింది.

ఆ సంఘటనే మలుపు తిప్పింది

- 6వ తరగతిలోనే కలెక్టర్ చాంబర్ చూశా
- అప్పుడే కలెక్టర్ కావాలని డిసైడ్ అయ్యా..
- చిన్ననాటి స్మృతులు నెమరు వేసుకున్న జేసీ మయూర్ అశోక్





నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వేషధారణలో చిన్నప్పటి మయూర్ అశోక్

సాక్షి, విశాఖపట్నం: రంగుల ప్రపంచంలో స్వేచ్ఛా విహంగం బాల్యం. కొత్త ప్రపంచంలోకి నడిపించే శైశవదశలో ప్రతి విషయం ఓ మధుర జ్ఞాపకమే అన్నారు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్. బాలల దినోత్సవం సందర్భంగా తన చిన్న నాటి జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు. బాల్యంలో జరిగిన ఒక సంఘటన తన జీవితాన్ని మలుపుతిప్పిందని చెప్పారు. 'మా సొంతూరు మహారాష్ట్రలోని బీడ్. నేను 6వ తరగతి చదువుతున్న రోజులవి. స్కూల్‌లో ఉన్న సమయంలో గుజరాత్‌లోని భుజ్‌లో భారీ భూకంపం వచ్చిందని మా టీచర్లు చెప్పారు. స్కూల్‌లో ఉదయం ప్రతిజ్ఞ సమయంలో వార్తలు చదివేవాళ్లం. దేశం యావత్తూ భుజ్ భూకంప బాధితులకు సహాయం చేసేందుకు ముందుకొస్తోందని.. మనం కూడా సాయమందిద్దామని టీచర్లు చెప్పారు. ఫండ్ కలెక్ట్ చేసేందుకు టీమ్ లీడర్‌గా నన్ను ఎంపిక చేశారు. ప్రతి విద్యార్థి నుంచి ఫండ్ కలెక్ట్ చేస్తూ.. దానికి సంబంధించిన లెక్కలను ఎప్పటికప్పుడు హెడ్ సర్‌కి చెప్పేవాడిని. అప్పుడే ఆర్థిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, సమయపాలన అలవర్చుకున్నాను. ఫండ్ ఎంత ఎక్కువగా ఇస్తే.. అంత మందికి సాయం చేయగలమన్న ఆలోచన నాలో వచ్చింది. అందుకే ప్రతి విద్యార్థీ వీలైనంత పెద్ద మొత్తంలో డబ్బులు అందించేలా ప్రోత్సహించాను. ప్రతి క్లాస్‌కు వెళ్లి మోటివేషన్ స్పీచ్ ఇచ్చేవాడిని. అది అందర్నీ ఆకట్టుకుంది. అప్పట్లోనే మా స్కూల్ తరఫున దాదాపు రూ.5లక్షల వరకు సేకరించగలిగాం. దీంతో నన్ను టీచర్లు అభినందించారు. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్‌కు అప్పగించే బాధ్యతను నాకే అప్పగించారు. అప్పుడే మొదటిసారి కలెక్టరేట్‌కు వెళ్లాను.అక్కడ కలెక్టర్ చాంబర్ చూశాను. ఐఏఎస్ అధికారి ఎలా ఉంటారన్నది చూసిన నాకు అక్కడ వాతావరణం ప్రేరేపించింది. నాలో కొత్త ఆలోచనలను రేకెత్తించేలా చేసింది. ఐఏఎస్ అధికారి కావాలన్న లక్ష్యాన్ని నాలో కలిగించిందీ ఆ సంఘటనే.. అప్పటి నుంచి ఐఏఎస్ అవ్వాలంటే ఏం చేయాలని మా టీచర్లను, తల్లిదండ్రులను అడిగేవాడిని. వారు చెప్పినదానికనుగుణంగా ప్లాన్ చేసుకున్నాను. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశాను. ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కూడా చదివాను. తర్వాత 2018లో సివిల్స్‌కు ఎంపికై.. నా కలను నెరవేర్చుకున్నాను. ప్రణాళికాబద్ధంగా శైశవదశను ఆస్వాదిస్తే.. ప్రతి ఒక్కరి బాల్యం మనకు కథ అవుతుంది. భావితరాలకు చరిత్రగా మారుతుంది' అని జేసీ మయూర్ అశోక్ చెబుతూ.. అందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

చిల్డ్రన్స్ డే రోజున ఏదో ఒక గేమ్‌లో ప్రైజ్‌లు వచ్చేవి. నాకు బాగా గుర్తుంది.. ఒకటో తరగతిలో స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలపై పోటీలు నిర్వహించారు. నేను నేతాజీ సుభాష్ చంద్రబోస్ గెటప్‌లో వెళ్లి డైలాగ్‌లు చెప్పాను. నాకే ఫస్ట్ ప్రైజ్ వచ్చింది అని జేసీ గుర్తు చేసుకుంటూ సంబరపడ్డారు.

నకిలీ పోలీస్ అరెస్ట్



నకిలీ పోలీస్ ఇతనే..

మధురవాడ/ఆరిలోవ: నకిలీ పోలీసు అవతారం ఎత్తి, దందా చేస్తున్న ఓ వ్యక్తిని పీఎంపాలెం క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి నేర విభాగం ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ తెలిపిన వివరాలు. పాడేరుకు చెందిన వంతల సంతోష్(32) నేరాలు చేయడానికి అలవాటు పడ్డాడు. రాష్ట్రంలోని పలు చోట్ల దొంగతనాలు చేసినట్టు సమాచారం. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో మధురవాడ డైలీ మార్కెట్ సమీపంలో ఉన్న ఓ సెల్ షాపు వద్ద పోలీసు యూనిఫారంలో ఉంటూ సెల్ ఫోన్ విక్రయించేందుకు ప్రయత్నించాడు. ఇతడి వ్యవ హార శైలి, యూనిఫారం తేడాగా ఉండడంతో సదరు సెల్ షాపు యజమాని పీఎం పాలెం క్రైం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సెల్ షాపు వద్దకు చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసు కుని పోలీసు స్టేషన్‌కి తరలించారు. అతడి నుంచి సెల్ ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరింత లోతు గా విచారణ చేయగా ఇతడిపై విశాఖ సిటీ పరిధిలోని ఆరిలోవ–2, గాజువాక, కంచరపాలెంతో పాటు పాడే రులో కూడా పలు కేసులు ఉన్నట్లు తెలిసింది. ఆరిలోవలో 2 కేసులు నమోదై ఉండడంతో నిందితుడిని వారికి అప్పగించినట్టు శ్రీనివాస్ తెలిపారు. ఆరిలోవ ఎస్ఐ కృష్ణ మరిన్ని వివరాలు వెల్లడించారు. గత నెల 21న తెన్నేటి పార్కు సెక్యూరిటీ గార్డు నుంచి ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వస్తానని చెప్పి, పోలీస్ వేషంలో బైక్ పట్టుకుపోయిన వ్యక్తి ఈ నకిలీ పోలీసేనని పేర్కొన్నారు. ఈ నకిలీ పోలీస్‌ను గురువారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

డాల్ఫిన్ నోస్‌పై డేగ కళ్లు

- అత్యాధునిక సర్వైలెన్స్ రాడార్ సేవలు ప్రారంభం
- విమానాల రాకపోకలపై మరింత నిఘా





రాడార్ వ్యవస్థని పర్యవేక్షించనున్న బృందం

సాక్షి, విశాఖపట్నం : గాల్లో చక్కర్లు కొడుతున్న విమానాల రాకపోకల్ని డేగ కళ్లతో కనిపెట్టేందుకు నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసింది తూర్పు నౌకాదళం. విశాఖ నగరంపై ఓవైపు యుద్ధ విమానాలు, మరోవైపు పౌర విమానాలు రివ్వున ఎగురుతూ.. ఉపరితలం బిజీబిజీగా మారుతున్న నేపథ్యంలో.. అత్యాధునిక రాడార్ వ్యవస్థని అందుబాటులోకి తీసుకొచ్చింది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 2డీ రాడార్‌ని డాల్ఫిన్ నోస్‌పై అమర్చారు.

విశాఖ అంతర్జాతీ విమానాశ్రయం నుంచి ప్రతి రోజూ సుమారు 70 వరకూ పౌర విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పాటు తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఉన్న సుమారు 50 వరకూ విమానాలు, హెలికాఫ్టర్లు దేశ భద్రత కోసం పహారా కాస్తున్నాయి. వీటిని ఈఎన్‌సీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎయిర్ బేస్ ఐఎన్ఎస్ డేగా పర్యవేక్షిస్తుంటుంది. అయితే ఎయిర్ ట్రాఫిక్ పెరుగుతున్న నేపథ్యంలో పర్యవేక్షణ వ్యవస్థను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు నౌకాదళం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో బీఈఎల్ తయారు చేసిన అత్యాధునిక రాడార్ వ్యవస్థని ఏర్పాటు చేసింది. ఎయిర్‌పోర్టు సర్వైలెన్స్ రాడార్(ఏఎస్ఆర్) సేవలను డాల్ఫిన్ నోస్‌పై బుధవారం ప్రారంభించారు. ఈ ఏఎస్ఆర్‌ని నేవల్ ఎయిర్‌బేస్ ఐఎన్ఎస్ డేగా పర్యవేక్షించనుంది.

360 డిగ్రీల్లో నిరంతర పర్యవేక్షణ : ఈ కొత్త రాడార్ వ్యవస్థ ద్వారా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు డిస్‌ప్లే స్క్రీన్స్‌పై ఎయిర్‌క్రాఫ్ట్‌ల సమాచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తాయి. గగనతలంలో సురక్షితమైన, క్రమబద్ధమైన ఎయిర్ ట్రాఫిక్‌ను నిర్వహించడానికి రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా పైలట్‌లను దిశా నిర్దేశం చేస్తారు. ఈ కారణంగా ఎయిర్‌సర్వైలెన్స్ రాడార్ (ఏసీఆర్) వ్యవస్థ గగనతలంలో ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణని కచ్చితమైన సమాచారంతో నిర్వహించగలవు. ఈ ఎయిర్ సర్వైలెన్స్ రాడార్ వ్యవస్థలు 25,000 అడుగుల (7,620 మీటర్లు) కంటే తక్కువ ఎత్తులోనూ, విమానాశ్రయం నుంచి 40–60 నాటికల్ మైళ్ల (75–110 కిమీ) లోపు విమానాలను మాత్రమే విశ్వసనీయంగా గుర్తించడంతో పాటు ట్రాక్ చేయగలవు. ఈ అత్యాధునిక ఏఎస్ఆర్ వ్యవస్థ పూర్తిగా డిజిటల్ రాడార్ సిస్టమ్. ఇది పౌర, సైనిక ఎయిర్‌ఫీల్డ్‌ల పరిసరాల్లో ఏకకాలంలో విమానం స్థానం, వాతావరణ పరిస్థితులను అంచనా వేసి.. సమాచారం అందిస్తుంది.

చిన్నారి కిడ్నాప్‌నకు యత్నం

ప్రతిఘటించిన తల్లి, హత్యాయత్నానికి పాల్పడిన దుండగులు



జరిగిన సంఘటనను వివరిస్తున్న చిన్నారి తల్లి నీలం పద్మ

అక్కిరెడ్డిపాలెం : చిన్నారిని అపహరించేందుకు ప్రయత్నించిన ఇద్దరు మహిళలు.. పాప తల్లిపైన హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో గాయపర్చి అక్కడి నుంచి పరారయ్యారు. గాజువాక సీఐ ఎ.పార్థసారధి, బాధితురాలు తెలిపిన వివరాలు. గాజువాకలోని సీతారాంనగర్‌లో నివసిస్తున్న నీలం పద్మ, నాగేశ్వరరావు దంపతులకు సంవత్సరం వయసున్న సహస్ర అనే కుమార్తె ఉంది. వీరి ఇంటికి సోమవారం ఒక మహిళ వచ్చి అన్నం పెట్టమని అడిగింది. అన్నం లేదని పద్మ చెప్పగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం అదే మహిళ వచ్చి అన్నం కావాలని గట్టిగా అడగ్గా పద్మ కోపడ్డంతో ఆమె అక్కడ నుంచి బయల్దేరింది. తిరిగి సాయంత్రం 6 గంటల సమయంలో అన్నం అడిగిన మహిళతో పాటు మరో మహిళ ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడ్డారు. ఒకరు పద్మ మెడ పట్టుకొని, మరొకరు పాపను తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పద్మ మెడ పట్టుకున్న మహిళ చేతిపై కొరికి గట్టిగా కేకలు వేసింది. ఇద్దరు మహిళలు చాకుతో పద్మ మెడపై, చేతిపై గాయపర్చి వారు తెచ్చుకున్న స్కూటీతో పరారయ్యారు. ఈ సమయంలో తల్లి, చిన్నారి మాత్రమే ఇంట్లో ఉన్నారు. వీరు కొద్ది రోజులుగా రెక్కీ నిర్వహించి చిన్నారి కిడ్నాప్‌నకు ప్లాన్ వేసినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న గాజువాక సీఐ పార్థసారధి, ఎస్ఐ రాధాకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న భువనేశ్వర్–కేఎస్ఆర్ బెంగళూరు–భువనేశ్వర్(18463/64) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–తిరుపతి–భువనేశ్వర్(22879/80) సూపర్‌ఫాస్ట్, విశాఖ–న్యూఢిల్లీ–విశాఖ(20805/06) ఏపీ ఎక్స్‌ప్రెస్, విశాఖ–లోకమాన్యతిలక్ టెర్మినస్–విశాఖ (22847/) సూపర్‌ఫాస్ట్, విశాఖ–లోకమాన్యతిలక్ టెర్మినస్– విశాఖ (18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు, విశాఖ–ధిఘా–విశాఖ(22874/73) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గాంధీదాం–పూరీ– గాంధీదాం(22973/74) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఏసీ, స్లీపర్ కోచ్‌లను జతచేస్తున్నారు.

నేడు పలు రైళ్ల రద్దు : రాఘవపురం–రామగుండం మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో 14న కాకినాడ పోర్ట్–విశాఖపట్నం–కాకినాడ పోర్ట్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు–విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 15న విశాఖపట్నం–గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

బీచ్‌రోడ్డులో 23 అంతస్తుల హోటల్



మాట్లాడుతున్న వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని గేట్ వే హోటల్ ఇక ఒక జ్ఞాపకంగా మిగిలనుంది. ఆ హోటల్ స్థానంలో 23 అంతస్తులతో నూతన హోటల్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వరుణ్ గ్రూప్ చైర్మన్ వి.ప్రభుకిశోర్ తెలిపారు. బుధవారం హోటల్ గేట్ వేలో విలేకరులకు ఆయన మాట్లాడుతూ వరుణ్ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో మూడు టవర్లుగా హోటల్ నిర్మాణం ఉంటుందన్నారు. 23 అంతస్తులతో, ఫైవ్ స్టార్ డీలక్స్ రూమ్‌లు 374 నిర్మిస్తామన్నారు. రెండో టవర్‌లో గ్రేడ్–1 అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ఆఫీస్ స్పేస్‌ని ఏర్పాటు చేస్తామన్నారు. మూడో టవర్‌లో 16 అంతస్తుల్లో సర్వీస్ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తామన్నారు. వీటిని విక్రయించి, వీటి నిర్వహణ తదితర అంశాలు వరుణ్ హాస్పిటాలిటీ గ్రూప్ నిర్వహిస్తుందన్నారు. నోవాటెల్ హోటల్‌ను డిజైన్ చేసిన ముంబయికి చెందిన ఆర్కిటెక్ మయురేష్ కటీర దీన్ని కూడా డిజైన్ చేశారన్నారు. హోటల్ పై అంతస్తులో ఒలింపిక్ స్థాయిలో స్విమ్మింగ్ పూల్, హెలీప్యాడ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ వ్యయం దాదాపు రూ.1500 కోట్లుగా అంచనా వేసినట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి ప్రస్తుత భవనాలు తొలగించడం పూర్తవుతుందని, 2028 చివరి నాటికి హోటల్ నిర్మాణం పూర్తిచేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వరుణ్ గ్రూప్ ఎండీ వరుణ్ దేవ్ గోవాను మించిపోయే సామర్థ్యం విశాఖకు ఉందన్నారు. జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వి.వర్ష మాట్లాడుతూ నగర అభివృద్ధికి ఉపయుక్తంగా నూతన హోటల్ నిలుస్తుందన్నారు. ఆర్కిటెక్ కటీర మాట్లాడుతూ మరింత ఆకర్షణీయంగా నూతన నిర్మాణం ఉంటుందన్నారు.